క్లుప్తంగా

దాడులతో వాస్తవాలు దాచలేరు



శ్రీధర్ ముదిరాజ్

కందుకూరు: పత్రికా స్వేచ్ఛను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాలరాస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నిజాన్ని నిర్భయంగా రాస్తున్న 'సాక్షి' దినపత్రికపై ఆ సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పాత్రికేయులపై దాడి.. ప్రజల హక్కులను హరించడమేనన్నారు. దాడులతో వాస్తవాలను దాచలేరని, ఇలాంటివి పునరావృతం కాకుండా.. కూటమి ప్రభుత్వం చూసుకోవాలని హితవు పలికారు.

17న టోకెన్ల పంపిణీ

కందుకూరు: యూరియా బస్తాల పంపిణీకి సంబంధించి టోకెన్లు అవసరమున్న రైతులకు ఈ నెల 17వ తేదీన రైతు వేదికల వద్ద పంపిణీ చేయనున్నట్లు ఏఓ లావణ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుమ్మడవెల్లి, బేగంపేట, కందుకూరు, నేదునూరు, పులిమామిడి, మీర్‌ఖాన్‌పేట రైతు వేదికల వద్ద ఉదయం 10.30 గంటల నుంచి టోకెన్లు పంపిణీ కొనసాగనుందన్నారు. అవసరమున్న రైతులు పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఏఈఓలను ఆయా రైతు వేదికల వద్ద కలిసి టోకెన్లు పొందాలని ఆమె కోరారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే..



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: స్కేటింగ్‌తో చిన్నారుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. ఆదివారం తుక్కుగూడ పుర కేంద్రంలో జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నారులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనన్నారు. ఆసక్తి ఉన్న క్రీడారంగంలో వారిని ప్రోత్సహించాలని సూచించారు. తుక్కుగూడలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కందుకూరు: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320 ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కందుకూరుకు చెందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గూడూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు మృణాళిని, పి.ఎల్లయ్య, వసుంధరను లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి చేతుల మీదుగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా లయన్స్ క్లబ్‌లో సేవలు అందిస్తున్న టీచర్లతో పాటు జీవితంలో స్థిరపడ్డ వారు చేరి సేవలందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ భీంరెడ్డి రాంరెడ్డి, టీచర్ ఆయూబ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

నాగోలు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాగోలు శాఖ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆదివారం సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. నాగోలు ప్రాంతంలో నివసిస్తున్న విశ్రాంత ఉద్యోగులకు సమావేశాలు, ఇతర అవసరాలకు భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. నాగోలు శాఖ అధ్యక్షులు బి.వి. ప్రతాప్ రెడ్డి, కార్యదర్శి అశోక్ కుమార్ రావు, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ లాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ పనుల పరిశీలన

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని ఆర్టీసీకాలనీలో కుంగిన డ్రైనేజీ మ్యాన్ హోల్ పనులను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ వ్యర్థాలతో నిండిపోయాయన్నారు. మ్యాన్‌హోల్స్ నిండిపోవటంతో డ్రైనేజీలు పొంగిపోయి మురుగు రోడ్లపై పారుతుందని తెలిపారు.

అవినీతికి అంతే లేదా?

- పనులు చేయకుండానే బిల్లులు కాజేస్తున్న వైనం
- ఆర్టీఐ ద్వారా వెలికి తీసిన ఐఎస్‌సదన్ కార్పొరేటర్



సుబ్రహ్మణ్యనగర్ మోడల్ మార్కెట్ వద్ద బాక్స్‌డ్రెయిన్ వేయాల్సిన ప్రాంతం

సైదాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు అధికారికంగా చేయాల్సిన పనికి లంచం తీసుకోవడం అవినీతి. అలాంటి అవినీతికి పాల్పడే అధికారులను బాధితులు అవినీతి నిరోధక శాఖకు పట్టించవచ్చు. మరి జీహెచ్‌ఎంసీ నిధులను పనులు చేయకుండానే బిల్లుల పేరుతో దోపిడీ చేస్తున్న అధికారులు, కాంట్రాక్టర్లను ఎవరు ఎలా పట్టుకోవాలి. వారిపై చర్యలు ఉండవా అంటే సమాధానం చెప్పే వారు కరువవుతున్నారు. సాక్షాత్తు డివిజన్ కార్పొరేటరే ఆర్టీఐ ద్వారా సమాచారం పొంది, తన డివిజన్‌లో సర్కిల్ స్థాయి అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటి వరకు ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకున్నారో వెల్లడి కావటం లేదు. గతంలోనూ రహదారి వేయకుండానే కాంట్రాక్టు, అధికారులు రూ. 10 లక్షల నిధులు మాయం చేశారన్న కార్పొరేటర్ ఫిర్యాదుతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇద్దరు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొన్నారు. అయితే నిధులు తిరిగి రాబట్టారా, సదరు కాంట్రాక్టర్‌పై ఏమైనా చర్యలు తీసుకున్నారా అనే ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఎవరూ చెప్పని పరిస్థితి నెలకొంది.

రూ. 51 లక్షలు స్వాహా!

సంతోష్‌నగర్ సర్కిల్ ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో మూడు చోట్ల వివిధ అభివృద్ధి పనులు అసలు ఏమాత్రం చేయకుండానే సర్కిల్ అధికారులు, కాంట్రాక్టర్లతో అంటకాగి రూ. 51 లక్షలను తమ జేబుల్లోకి మళ్లించుకున్నారు. ఇది కేవలం ఆరోపణలు కాదు. పూర్తి స్థాయి వివరాలతో ఆర్టీఐ ద్వారా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల నుంచి పొందిన సమాచారంతో కార్పొరేటర్ వెలుగులోకి తెచ్చిన ఉందతమిది. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని డీఎస్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం పక్కన అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ వద్ద రూపాయి పని చేయకుండానే పనులు పూర్తి అయినట్లు రూ. 10.50 లక్షల బిల్లు, అదే బస్తీలో పబ్లిక్ టాయిలెట్లు



డీఎస్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మించామని బిల్లులు పొందిన ప్రాంతం

కూల్చి మరో కమ్యూనిటీ హాల్ నిర్మించారని రూ. 18.80 లక్షల బిల్లు, సుబ్రమణ్యనగర్ కాలనీ మోడల్ మార్కెట్ ఎదురుగా బాక్స్ డ్రెయిన్ నిర్మించారని రూ. 22 లక్షల బిల్లులను అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి స్వాహా చేసారు.

అవినీతికి అడ్డాగా ఐఎస్‌సదన్ డివిజన్

జీహెచ్‌ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ ఐఎస్‌సదన్ డివిజన్ అధికారుల అవినీతికి అడ్డాగా మారింది. కాంట్రాక్టర్లను తమకు అనుకూలంగా మార్చుకొని విలువైన ప్రజాధనంతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వారు తమకు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. గతంలో అభివృద్ధి పనుల వద్ద అధికారులు కమీషన్లు తీసుకుంటారనే ఆరోపణలు వచ్చేవి. అలాంటిది ఇప్పుడు ఎలాంటి పనులు చేయకుండానే బిల్లులు దండుకోవటం వారికి పరిపాటిగా మారింది. డివిజన్ పరిధిలో ముఖ్యంగా బస్తీలలోనే ఈ ఘటనలు వెలుగు చూస్తున్నాయి. గతంలో నిరుపేదలు నివసించే సింగరేణి కాలనీలో, ఇప్పుడు కూడా డీఎస్‌నగర్‌లోనే ఈ అవినీతి ఉదంతాలు బయటకు వచ్చాయి. నిరుపేదలు, నిరక్షరాసులకు తమ ప్రాంతంలో జరిగే, జరగాల్సిన అభివృద్ధి పనుల విషయమై అవగాహన లేకపోవడాన్ని అవినీతిపరులు ఆసరాగా చేసుకుంటున్నారని తెలుస్తోంది.

కఠిన చర్యలు తీసుకోవాలి



తప్పులు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే మరొకరు అలాంటి తప్పులు పునరావృతం చేయకుండా ఉంటారు. ఐఎస్‌సదన్ డివిజన్‌లో పనులు చేయకుండా బిల్లులు తీసుకున్న ఘటనలో సంబంధం ఉన్న అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని వారి నుండి బిల్లుల సొమ్మును రికవరీ చేయాలి. ఐఎస్‌సదన్‌లోని పలు బస్తీలలో ఇటీవల పూర్తయిన అభివృద్ధి పనులు అన్నింటిపై విచారణ జరిపిస్తే అవినీతి పరుల గుట్టు బయటకు వస్తుంది.

–జంగం శ్వేత,
ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



మాదాపూర్‌లో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

కందుకూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని గుమ్మడవెల్లి, మాదాపూర్, కొలన్‌గూడల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండాలు ఎగురవేసేలా కార్యకర్తలు కష్టపడాలన్నారు. అనంతరం గ్రామ కమిటీలను ఎన్నుకొని ప్రకటించారు. గుమ్మడవెల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా అచ్చన తిరుపతి, యూత్ అధ్యక్షుడిగా తాళ్ల ప్రవీణ్, మాదాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా చేకూరి బుగ్గ రాములు, యూత్ అధ్యక్షుడిగా మంద ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పి.ఆనంద్, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు టి.ఇందిరాదేవేందర్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చల్లా నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలు



నాయకులు, కార్యకర్తల మధ్య వేడుకలు జరుపుకొంటున్న నర్సింహారెడ్డి

మీర్‌పేట: టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం మందమల్లమ్మ చౌరస్తాలోని చంద్రాగార్డెన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన.. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య కేక్‌కట్ చేశారు. అనంతరం కార్యకర్తలు ఆయనను శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు నర్సింహారెడ్డి కర్మాన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు, స్థానిక నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, సిద్దాల శ్రీశైలం, సిద్దాల దశరథ, పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, బైగళ్ల బాలమణి, కీసర యాదిరెడ్డి, సంతోష్‌కుమార్, విజయవర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఐతరాజు భాస్కర్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీహిల్స్ కాలనీ-2 అధ్యక్షుడిగా జెల్ల రమేశ్‌గౌడ్



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని శ్రీహిల్స్ కాలనీ ఫేస్-2లో ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సర్వసభ్య సమావేశం నిర్వహించుకొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా జెల్ల రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రవిందర్‌నాయక్, కోశాధికారిగా గుర్రం ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాములు, సెక్రటరీగా కిరణ్ కుమార్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా పెద్దోజు నర్సింహాచారి, కార్యవర్గ సభ్యులుగా రాజలింగంగౌడ్, శంకర్ నాయక్, తిరుపతిగౌడ్, ఐతరాజు రవి, వెంకటేశం, జానీపాషా, రమణాచారి, రామలింగచారి, శ్రీను తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ నూతన కమిటీ

రామంతాపూర్ : ప్రధాన రహదారిలో విజయదశమి రోజున నిర్వహించే రావణ సంహారమేళా దసరా ఉత్సవాల కమిటీని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ఆదివారం నియమించారు. కమిటీ చైర్మన్‌గా బుర్ర రాజేశ్వర్, అధ్యక్షులుగా వల్లపు జగన్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా జగదీష్, ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణగౌడ్, సభ్యులుగా రేవు నరసింహ, సంతోష్ గుప్తా, వెంకటేష్, రవీందర్, శ్రీనివాస్, ఉపేందర్, ముత్యం దర్శనాల సుధాకర్, శైలేందర్, మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఉపశమనం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందుతున్నారని, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సామాన్యులకు వైద్యభారం తగ్గుతోందని పీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న పలువురు బాధితులు ఆర్థిక సహాయం కోసం మధుయాష్కీగౌడ్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేయించి చెక్కులను ఆదివారం వనస్థలిపురంలోని కార్యాలయంలో అందజేశారు. నాయకులు శ్రీపాల్‌రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, రవీందర్‌గౌడ్, అశోక్‌గౌడ్, రామారావు, రాజశేఖర్, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కార్యక్రమంలో అహోబిలం రామానుజ జీయర్ స్వామి, ఎన్.రాంచందర్‌రావు తదితరులు

మన్సూరాబాద్: శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక సహాయం శనివారం రాత్రి అందజేశారు. ఈ కార్యక్రమానికి అహోబిల రామానుజ జీయర్ స్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాచందర్ రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ వేదాల శ్రీనివాస్, కండ్లకుంట కమల, మరింగంటి కులశేఖరచార్యులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఉప్పల్: మతిస్థిమితం సరిగ్గా లేని బాలిక అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4న చోటు చేసుకుంది. బచ్చన్న పేట మండలం సాలవుల్లీ గ్రామానికి చెందిన రేణుక కుమార్తెకు మతిస్థిమితం సరిగ్గా లేదు. చికిత్స కోసం 1న ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. 3 రోజుల చికిత్స అనంతరం తిరుగు ప్రయాణంలో 4న ఉస్మానియా నుంచి బస్సులో ఉప్పల్ వరంగల్ బస్టాప్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో బస్సుకోసం తల్లి రేణుకా డ్రైవర్‌ను ఆరా తీస్తుండగా.. అంతలోనే బాలిక కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం బాలిక తల్లి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

అమరుల త్యాగం వెలకట్టలేనిది

- పోరాట యోధులను నిత్యం స్మరించుకోవాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగయ్య యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య యాదవ్

మహేశ్వరం: తెలంగాణ విమోచన కోసం ఎంతో మంది పోరాడి.. ప్రాణత్యాగం చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కదారి జంగయ్య యాదవ్ అన్నారు. వారి త్యాగాలు వెలకట్టలేనివని, ఆ పోరాట యోధులను నిత్యం స్మరించుకోవాలని కోరారు. ఆదివారం మండల పరిధి దుబ్బచర్ల గ్రామం శ్రీలక్ష్మీ నర్సింహా స్వామి ఆలయ ప్రాంగణంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నాడు వారు చేసిన పోరాట ఫలితమే తెలంగాణకు స్వేచ్ఛా వాయువులు లభించాయని తెలిపారు. ఈ పోరాటంలో అమరులైన వారి గురించి నేటి తరానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. 17న విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదలా ఉండగా.. 17వ తేదీన ప్రధాని మోదీ జన్మదినం అని, నాటి నుంచి అక్టోబర్ 2 వరకు సేవాపక్షం పేరిట సేవా కార్యక్రమాలను పార్టీ నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. 17న జాతీయ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి యాదయ్య, యాదయ్య గౌడ్, మండల అధ్యక్షుడు టి.యాదిష్, సీనియర్ నాయకులు అనంతయ్య గౌడ్, మాధవచారి, సుదర్శన్ యాదవ్, వెంకటేష్ గౌడ్, దేశ్యా నాయక్, ముత్యం పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



కందుకూరు: బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తదితరులు

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. మండల పరిధిలోని నేదునూరుకు చెందిన బాధితులు అనేగొని రవీందర్‌గౌడ్‌కు రూ.60వేలు, బద్దుల మహేందర్ యాదవ్‌కు రూ.59వేలు, గంగుల స్రవంతికి రూ.60వేలు, మల్దేవి మమతకు రూ.30వేలు చొప్పున సీఎంఆర్‌ఎఫ్ నుంచి చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం వారికి ఆయన ఆ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. రాజకీయాలను పక్కకు పెట్టి అందరూ కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జి.ప్రభాకర్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, పీఏసీఎస్ డైరెక్టర్ సాధ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోలిపేట అమరేందర్‌రెడ్డి, ఇంద్రకంటి రాకేశ్‌గౌడ్, వరికుప్పల బాబు, అంకగళ్ల దర్శన్, గడిగె రాములుగౌడ్, పడమటి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీకి చెందిన దుర్గడ్ సంగ్రామ్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.5లక్షల ఎల్‌ఓసీని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కెంచె లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు



బందోబస్తును పర్యవేక్షిస్తున్న పోలీసులు

పహాడీషరీఫ్: మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా షాహీన్‌నగర్, ఎర్రకుంట, కొత్తపేట, ఉస్మాన్‌నగర్, వాదే ముస్తఫా, పహాడీషరీఫ్ ప్రాంతాల్లో ముస్లింలు భారీగా ర్యాలీలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో అన్నదానం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మహేశ్వరం డివిజన్ ఏసీపీ జానకీ రెడ్డి పర్యవేక్షణలో బాలాపూర్, పహాడీషరీఫ్ ఠాణా ఇన్‌స్పెక్టర్లు ఎం.సుధాకర్, రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి



కాలనీవాసులతో కలిసి మురుగునీటి పైప్‌లైన్లను పరిశీలిస్తున్న మల్లారెడ్డి

బడంగ్‌పేట్: డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే మురుగునీరు రోడ్లపైకి వస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 24వ డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి అన్నారు. ఆదివారం బాధితుల విన్నపం మేరకు కాలనీవాసులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24వ డివిజన్ విశాఖనగర్ కాలనీ నుంచి 26వ డివిజన్‌లోని శ్రీశ్రీహోమ్స్ కాలనీ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పాటు, గతంలో అస్తవ్యస్తంగా లైన్‌లు వేయడంతో అంతర్గత కాలనీల్లో మురుగు నీరు పార్లి కంపు కొడుతుందని పేర్కొన్నారు. దీంతో న్యూ తిరుమలనగర్, ఎంఆర్‌ఆర్‌కాలనీ, శ్రీసాయిహోమ్స్, శ్రీవెంకటేశ్వరకాలనీ, ఏఆర్‌సీఆర్, విశాఖనగర్, జయశంకర్ తదితర కాలనీలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి కొత్త డ్రైనేజీ పైప్‌లైన్లు వేసేందుకు నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, కాలనీవాసులు ఉన్నారు.

సగర మహిళా సంఘం కమిటీ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న మహిళలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీ సగర మహిళా సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర సగర మహిళా సంఘం పర్యవేక్షణలో స్థానిక కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షురాలిగా సంగిశెట్టి శశికళ, ప్రధాన కార్యదర్శిగా అత్తినారపు రాధ, కోశాధికారిగా పెబ్బేటి హారిక, ఉపాధ్యక్షురాలిగా పెబ్బేటి మీన ఎన్నికయ్యారు. కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుండ్ల స్రవంతి అన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు విజయలక్ష్మి, చిలుక శ్రీకాంత్, ఆవుల బీచ్‌పల్లి, లింగస్వామి, నాగరాజు, శ్రీశైలం, తిరుపతయ్య, నాగేశ్, కురుమూర్తి, నిరంజన్, శాంతయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.